విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 16, జూలై 2024

సమస్యల వలయంలో పోలీస్ స్టేషన్

- పోలీసు స్టేషన్ భవనం శిథిలం
- పైకప్పు కూలి పోకుండా కర్రల ఏర్పాటు
- భయం గుప్పిట్లో పోలీసులు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. బ్రిటీష్ కాలం నాటి నిర్మాణం చెక్కు దంతెలతో వేసిన భవనం కావడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. పోలీసులు, సిబ్బంది దంతెలు, దూలాలు కూలకుండా అడుగు భాగా న కర్రలు ఏర్పాటు చేశారు. వాటి కిందనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు కూలుతుందోనని వారు భయం భయంగా ఉంటున్నారు. ఉన్న తాధికారులు స్పందించి భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్ : చాగలమర్రి పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నివసిం చేందుకు నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి పోలీసులు నివాసం ఉండేందుకు గతంలో క్వార్టర్స్ నిర్మించారు. భవనాలు లోపలి భాగం దెబ్బతిని పెచ్చు లూడుతున్నాయి. దీంతో పోలీ సులు అద్దె ఇళ్లలో ఉంటున్నారు. కొత్త భవనాలు నిర్మిస్తే పోలీసులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

వేధిస్తున్న పోలీసు సిబ్బంది కొరత : చాగలమర్రి పోలీసు స్టేషన్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఎస్ఐ, ఏఎస్ఐ, ఇద్దరు హెడ్ కాని స్టేబుళ్లు, 5 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 18 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం 7 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పని భారం అధికమై ఉన్న పోలీసులు ఇబ్బందికి గురౌతున్నారు. ఉన్న పోలీసుల లోనే ఇద్దరు స్టేషన్లోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. రాత్రి పూట గస్తి చేయ దానికి కూడా వీలు లేదు. పోలీసు స్టేషన్లో ఖాళీగా ఉన్న కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేసి ప్రజలకు రక్షణ సేవలు అందేలా ఉన్నతా ధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా ఎస్పీ చాగలమర్రి పోలీసు స్టేషన్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

హామీ ఇచ్చాడు.. వెనువెంటనే నెరవేర్చాడు

విశాలాంధ్ర - బనగానపల్లె : ఓ రోజు ముందు సమస్యను చూసి, ఆ మరుసటి రోజే పరిష్కారం చూపించడంతో బీసీ రాజారెడ్డిపై పలువురు ప్రసంశల జల్లు కురిపిస్తున్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పట్టణంలోని మదర్ థెరిస్సా చర్చి, కరెంట్ ఆఫీస్, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులు ఆయా కాలనీలలోని సమస్యలను బీసీ రాజారెడ్డి దృష్టికి తెచ్చారు. ముఖ్యముగా ఆయా కాలనీలకు వెళ్లే దారుల్లో ఉన్న కల్వర్టులు ప్రధాన రహదారికి ఎత్తుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని బీసీ రాజారెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి మరుసటి రోజే కల్వర్టులకు ర్యాంపులు వేయించి సమస్యకు పరిష్కారం చూపించారు. రూ.20 వేల సొంత డబ్బులతో నాలుగు కల్వర్టులకు ర్యాంపులు వేయించారు. దీంతో ఆయా కాలనీ వాసులు బీసీ రాజారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ మందులపట్ల జాగ్రత్త వహించండి

విశాలాంధ్ర - వెలుగోడు: నకిలీ పురుగు మందుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. మండలంలోని వేల్పనూరు, రేగడ గూడూరు, వెలుగోడు గ్రామాల్లో ఆత్మకూరు ప్రాంతవాసులు కోబ్రా అను కార్బోఫెరాన్ గుళికలు నకిలీ పురుగుల మందును ఎటువంటి బిల్లులు లేకుండా లైసెన్సులు లేకుండా వివిధ వాహనాల్లో రాత్రి వేళ, ప్రాతఃకాల సమయం ఉదయం 6 నుండి 8 గంటల లోపు వచ్చి రైతులకు మోసపూరితమైన మాటను చెప్పి, నకిలీ పురుగుల మందులను విక్రయాలు జరుపుతున్నారు. రైతులందరూ అప్రమత్తంగా ఉండి, నకిలీ పురుగుల మందులను కొనవద్దని ఏవో పవన్ కుమార్ రైతులకు సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంట కాలానికి సంబంధించి పొలము కౌలుకు సాగు చేసే ప్రతి రైతు రెవెన్యూ వారు జారీ చేసే కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని ఏవో కుమార్ తహసీల్దార్ విజయ్ కుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డు వల్ల రైతులకు రైతు సేవ కేంద్రం ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చని పంట నమోదు చేసుకొని పంట బీమా పొందవచ్చని ఏవో తెలిపారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

విశాలాంధ్ర - నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో ఎ.పద్మజ, జిల్లా అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయ సర్వీస్‌లకు సంబంధించి సివిల్ సప్లైస్, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలకు సంబంధించిన సమస్యలను సచివాలయాల వారీగా ఎంపీడీవోలు విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వచ్చేవారం నుండి రెవిన్యూ శాఖకు వచ్చే దరఖాస్తులు తగ్గుముఖం పట్టాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

కౌలురైతు పత్రలు త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర - పాములపాడు: కౌలు రైతు పత్రాలను గ్రామస్థాయిలో పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రమైన పాములపాడులోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయులు, మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 750 పత్రాలు ఇవ్వవలసి ఉంది కానీ, మనం 135 వరకే ఇవ్వడం జరిగింది. అనంతరం ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయులు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఇంత వరకు ఒక కౌలు పత్రం కూడా ఇవ్వలేదన్నారు. గ్రామాలు ఇప్పటికైనా కౌలు పత్రము ఇవ్వడం మొదలుపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొనడం జరిగింది.

నేటికీ అంతు చిక్కని ఆచూకీ..

- మరో సారి జాగిలాలతో గాలింపు ..
- గాలింపునకు వర్షం అంతరాయం..
- బాధిత కుటుంబానికి 10 లక్షల పరిహారం
- ముచ్చుమర్రికి రానున్న హెూంశాఖ మంత్రి..

విశాలాంధ్ర - మిడుతూరు : పగిడ్యాల మండల పరిధిలోని ముచ్చుమర్రి పంచాయితీ మజారా గ్రామమైన.. ఎల్లాలకు చెందిన ఎనిమిదేళ్ల బాలిక అదృశ్యమై నేటికి తొమ్మిది రోజులు గడిచాయి. నేటికీ అదృశ్యమైన వాసంతి జాడ కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలు కేసు దర్యాప్తు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది. ఈ గాలింపు చర్యలకు రెండు రోజులుగా వర్షం కురవడంతో అంత రాయం ఏర్పడింది. అయితే రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రసార మాధ్యమాల్లో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల చిన్నారి వాసంతికి జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని, తామే స్వయంగా ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని అందజేస్తామని వెల్లడించారు. నిందితులు ఎంతటి వారైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని

తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు.. రేపో ముచ్చుమర్రి గ్రామానికి హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత రానున్నట్లు తెలుస్తోంది.

కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - రుద్రవరం: భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే రైతులు కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మురళీ మోహన్ తెలిపారు. స్థానిక తహ సీల్దార్ కార్యాలయం నందు పంట సాగు హక్కు పత్రాల మీద రైతు సేవ కేంద్రాల సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులకు తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని కౌలు రైతులను త్వరితగతిన గుర్తించాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ మాట్లాడుతూ మండలంలో కౌలుకు వ్యవసాయం చేసే ప్రతి రైతు సీసీఆర్సీ కార్డ్స్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనివలన ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్నప్పుడు, పంటలు పండించిన తర్వాత మార్కెట్ యార్డునందు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చినప్పుడు సీసీఆర్సీ కార్డ్స్ ఉపయోగ పడతాయని తెలిపారు. కౌలు కార్డు దరఖాస్తు కొరకు భూ యజమాని సంబంధిం చిన వన్ బీ, పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, కౌలుకు సాగుచేసే రైతు ఆధార్ కార్డు రెండు పాస్ ఫొటోస్‌తో రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఆర్ఐ రామరంజిత్ కుమార్, ఏఈఓ. రాజు, వీఆర్వోలు రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని షాదీఖానా సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సోమవారం ఆకస్మికముగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యతోపాటు విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశిత మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా పాఠశాలలో నెలకొన్న సమస్యలను గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అఖిలప్రియ విద్యార్థినిలకు తమ వ్యక్తిగత ఫోన్ నెంబర్‌ను ఇచ్చి ఏమైనా సమస్యలు ఉంటే తనకు ఫోన్ చేయాలన్నారు. పాఠశాల తరగతి గదులను, హాస్టల్, వంటశాలలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది క్రమశిక్షణతో మెలగాలని, ఏ చిన్న ఫిర్యాదు తమ దృష్టికి వచ్చినా సహించేది లేదన్నారు. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబును ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో తాము చాలా నిక్కచ్చిగా ఉంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసే స్వీపర్లు తమకు జీతాలు సక్రమంగా అందడం లేదని ఎమ్మెల్యే అఖిలప్రియ దృష్టికి తీసుకొని రాగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి బకాయి ఉన్న జీతాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కౌన్సిలర్ హుస్సేన్ బాష, చింతకుంట శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక ప్రదర్శన

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయం నందు రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఘనులు, భూగర్భ శాఖ మాజీ ఎండీ, వీడీ రాజగోపాల్ తెలిపారు. ఈ నెల 21న గురు పౌర్ణమి వేడుకలు సందర్భంగా శ్రీ శిరిడి సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆయా గ్రామాల భజన సంఘాల చేత భజనలు, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకులు డాక్టర్ రవీంద్ర బాబు అరవ, నోరి రఘురామమూర్తి దంపతుల చేత భక్తి గీతాంజలి పాటలు కార్యక్రమం ఉంటుందన్నారు. 15 ఏళ్లలోపు పదిమంది చిన్నారులచే భక్తి పాటల పోటీ ఉంటుందని, ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు. రాత్రి రాష్ట్రస్థాయి పౌరాణిక కళాకారులచే పంచమాంకములు పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

పంపు హౌస్ కూలగొట్టారు.. పట్టించుకోండి సార్ !

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో 40 ఏళ్ల కిందట మంచినీటి సరఫరా నిమిత్తం పంప్ హౌస్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం మాది అంటూ గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో రామమోహన్ రెడ్డితో కలిసి కొందరు పంప్‌హౌస్ నేల కూల్చారని గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఆవుల రాఘవేంద్ర రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఈవోపీఆర్డీ మహీధర్ రెడ్డిలకు మాజీ ఉప సర్పంచ్ వివరించారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన పంపు హౌస్‌ను ఇప్పుడు తొలగించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సాయంత్రంలోగా గ్రామాన్ని సందర్శించి, పడగొట్టిన స్థలాన్ని పరిశీలించి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

కౌలు రైతులకు అవగాహన

విశాలాంధ్ర- అవుకు: మండలంలోని సింగనపల్లి, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన కౌలు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో ఆయా రైతు సేవా కేంద్రాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతులను ఉద్దేశించి వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ మాట్లాడుతూ కౌలు రైతులు భూ యజమానుల వద్ద నుండి కౌలు కార్డులు తీసుకోవాలని అన్నారు.కౌలు కార్డు వలన పంట నమోదు, ప్రభుత్వం వారిచే పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, వంట నష్టం, పంట బీమా, బ్యాంకు రుణాలు వంటి ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. కనుక కౌలు రైతులందరూ తప్పకుండా గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డు పొందవలెనని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆణి స్వాతి జ్యేష్టాభిషేకం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలంలో సోమవారం ఆణి స్వాతి జ్యేష్టాభిషేకం వైభవంగా జరిగింది. శ్రీ పెరియాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఉదయం ఉత్సవమూర్తి శ్రీ ప్రహ్లాదవరద స్వామి గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగగా పర తత్వ నిర్ణయం చేసే వేద మంత్రాలను పెరియాళ్వార్ పాశురాలను విన్నవించారు. అనంతరం శ్రీ స్వామి వారికి ఆలయ రంగ మంటపంలో విశేష జ్యేష్టాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం స్వామి వారి స్వర్ణ కవచములను తీసివేసి స్వయం తిరుమేనికి పాలు, పెరుగు పన్నీరు పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఊరేగింపుగా అహెూబిల మఠం వద్దకు తీసుకుని వచ్చారు. ప్రహ్లాద వరద స్వామికి అహెూబిలం 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యూనిఫారం దుస్తుల అందజేత

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: స్టూడెంట్ కిట్టులో భాగంగా పాఠశాలలకు మంజూరైన యూనిఫారం దుస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు ఎంఈవో వీరప్రతాప్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 2,077 యూనిఫారం దుస్తులు, పదో తరగతికి సంబంధించిన ఫిజికల్ పాఠ్యపుస్తకాలు 336 వచ్చాయన్నారు. వీటిని విద్యార్థులకు అందజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

కామ్రేడ్ పాపన్న మృతికి జిల్లా సమితి సంతాపం

విశాలాంధ్ర - నంద్యాల : కర్నూలు జిల్లా మద్దికెర మండలం సీపీఐ మాజీ కార్యదర్శి, బసినేపల్లి మాజీ సర్పంచ్ కామ్రేడ్ పాపన్న సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి నంద్యాల జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్‌లు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. పాపన్న ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

17న శ్రీ రుక్మిణి పాండురంగస్వామి వారి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాలలో వెలసిన శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి వారి కళ్యాణోత్సవం రేపు రంగరాజు వీధి నందు జరుగుతుందని ప్రెసిడెంట్ షణ్ముఖ రావు తెలిపారు. తొలి ఏకాదశి రోజున శ్రీరుక్మిణి పాండురంగ స్వామి వారి కల్యాణోత్సవానికి భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని, పాండురంగస్వామి వారి ఆశీర్వాదం పొందాలని ఆయన కోరారు. ప్రత్యేక అలంకారంతో రథోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అది రాజ్‌సింగ్ రాణా

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా ఎస్పీగా అదిరాజ్ సింగ్ రాణా బాధ్యతలు చేపట్టారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఎస్పీగా నూతనంగా విచ్చేసిన ఆదిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆదిరాజ్ సింగ్ రాణా నేడు జిల్లా కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో నంద్యాల జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాకు సంబంధించి ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని వాటికి అనుగుణంగా పాలన సాగిస్తానని, ప్రజలకు అండగా ఉంటానన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని సోమవారం ప్రజా స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సీపీఐ నాయకులు విన్నవించారు. యాలూరు గ్రామానికి చెందిన ఎం.చెన్నయ్య ఇంటి సమస్య, జూపాడుబంగ్లా పారుమంచాల మజర గ్రామమైన చాబోలు గ్రామంలో నివసిస్తున్న గిరిజనులకు ఇంటి పట్టాలు, పూతలపాడు మజర గ్రామమైన చాబోలు గ్రామంలో అతిసారతో మృతి చెందిన నడిపి నాగన్న కుటుంబానికి ఆదుకోవాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజ్ కుమారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, జిల్లా సమితి సభ్యులు సామేలు, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, బాధితులు చెన్నయ్య, గిరిజనులు నరసింహులు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న మాదిరిగానే తయారయ్యారని, రెవెన్యూ అధికారులు ఎన్నికలున్నాయనే మిషతో సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ రాజకుమారి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని వారు తెలిపారు.

ఉపాధి వేతన వృద్ధిరేటు పెంచండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - నంద్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సగటు దినసరి కూలీ రూ.300 కూలీ మొత్తానికి చేరుకునేలా పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఎంపీడీఓలు, సంబంధిత ఏపీడీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో ప్రజా సమస్య పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌డీఏ ఎ.పద్మజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ దినసరి సగటు వేతనం రూ.239 మించడం లేదని కేంద్ర ప్రభుత్వం రూ.300 మంజూరు చేసినప్పటికీ, ఆ మేరా పనులు కల్పించడంలో విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా ఉపాధి సగటు దినసరి కూలి రూ.250 వేతనాన్ని అధిగమించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలు, సంబంధిత ఏపిడిలను ఆమె ఆదేశించారు. జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి అనుకూలంగా ఉందని, మొక్కల పెంపకాన్ని ఉపాధి హామీ కింద చేపట్టాలన్నారు. 76 లక్షల పని దినాల లక్ష్యానికి గాను 46 లక్షల పని దినాలు మాత్రమే సాధించామని అడిగిన వారందరికి పనులు కల్పించి, కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి కోటి దినాలు కల్పించే దిశలో డ్వామా అధికారులు, ఎంపీడీఓలు పనిచేయాలని ఆమె ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కౌలు రైతులకు సంబంధించి సీసీఆర్సీ కార్డుల 22,780 లక్ష్యానికి గాను రెన్యువల్స్ 9.8 శాతం మాత్రమే అయ్యాయని, 130 కోట్ల రుణాలు ఇవ్వాల్సిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులు, తాసీల్దారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నం భోజన పథక అమలు పనితీరు పర్యవేక్షించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని ఎంపీడీవోలు, తాసిల్దారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో దాదాపు 100 మంది పిల్లల గైర్హాజరవుతున్నారని, ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులను విచారించారా లేదా ఎలాంటి చర్యలు చేపట్టారు, సంబంధిత నివేదికలు అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి సంబంధిత అధికారుల నోటీసులో లేకుండా ప్రతికూల వార్తలు వస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర - నంది కొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నందు సోమవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనంను పట్టణ పురపాలక సంఘం చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండే భోజనం తయారీ కట్టెలపై చేయడం ద్వారా తరగతి గదుల్లోకి పొగ వెళ్ళడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని నిర్వాహకులపై మండిపడ్డారు. ఈ విషయంపై పలుమార్లు వంట మనిషికి చెప్పిన పద్ధతి మార్చుకోవడం లేదని పాఠశాల యాజమాన్యం ఆయనకు తెలిపారు. అనంతరం చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యత లోపించిందని, అధిక శాతం నీళ్ళతో కూడిన ఎగ్ కర్రీని విద్యార్థులకు ఎలా వడ్డిస్తారని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాల సహకరిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా చేశారంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటశాల పరిసరాల్లో పరిశుభ్రత లోపించిందని, పద్ధతి మార్చుకోకపోతే వీటిపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు ఇంచార్జ్ వీఆర్ శ్రీను, టీడీపీ నాయకులు ఉస్మాన్ బేగ్, లాలు ప్రసాద్‌లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 16, జూలై 2024

సుంకేశ్వరి గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఇంఛార్జి కలెక్టర్ మౌర్య
వాంతులు, విరోచనాలతో మరణించిన బాలిక (జ్యోతి) కుటుంబాన్ని పరామర్శ
పది రోజుల పాటు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలి



విశాలాంధ్ర-కర్నూలు/మంత్రాలయం: మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామాన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ మౌర్య సోమవారం సందర్శించారు..వాంతులు, విరోచనాలతో మరణించిన బాలిక (జ్యోతి) కుటుంబాన్ని ఇన్చార్జి కలెక్టర్ పరామర్శించారు..అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఇన్చార్జి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పరిస్థితి బాగుపడేంత వరకు వారం లేదా పది రోజులైనా కానీ మెడికల్ క్యాంపు పెట్టి గ్రామస్థులకు వైద్య సహాయం అందచేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీని, పీహెచ్‌సీ డాక్టర్‌ను ఊళ్లోనే ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో కలుషితమైన తాగునీరు కలుషితం అయిందా లేదా అనే విషయం తెలుసుకోవడానికి నీటి శాంపిల్స్‌ను పరీక్షలకు పంపించడం జరిగిందని తెలిపారు.అప్పటి వరకు రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటిని సరఫరా చేయాలని సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో నీటిని టెస్ట్ చేయాలని, ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వానాకాలం అయినందున ప్రజలు కూడా నీటిని కాచి తాగేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డయేరియా లాంటి వ్యాధులతో బాధపడే వారు వెంటనే సంబంధిత పిహెచ్సి డాక్టర్లను సంప్రదించాలని ఇన్చార్జి కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదోని ఏరియా హాస్పిటల్‌లో వాంతులు, విరేచనాలతో అడ్మిట్ అయిన సుంకేశ్వరి గ్రామానికి చెందిన నలుగురిని ఇన్చార్జి కలెక్టర్ పరామర్శించారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. ఇన్చార్జి కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, ఎస్ఈ ఆర్డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, డీపీవో నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు పాపన్న మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-మద్దికెర : మండల పరిధిలోని మదనంతపురం గ్రామానికి చెందిన సీపీఐ మాజీ మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ పాపన్న మృతి చెందడం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్యలుఅన్నారు. సోమవారం మదనంతపురంలోని కామ్రేడ్ పావన్న నివాసం చేరుకొని పాపన్న పార్థీవదేహానికి ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతి పట్ల సంతాపం వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ పాపన్న మృతి పార్టీకి తీరని లోటని, ఆయన పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. పాపన్న కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ జిల్లా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నబిరసూల్, సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు యాదవ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజా సాహెబ్,నాయకులు కామ్రేడ్ కోదండ, రంగస్వామి, రామాంజనేయులు, సుధాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పాపన్న మృతికి సీపీఐ జిల్లా సమితి సంతాపం

కర్నూలు : మండలం మదనంతపురం గ్రామానికి చెందిన సీపీఐ మాజీ మండల కార్యదర్శి బసినేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కామ్రేడ్,పాపన్న సోమవారం మదనంతపురం గ్రామంలో వారి స్వగృహంలో గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించడం పట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాపన్న మృతి చాలా బాధాకరమని,వారి మృతికి సీపీఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు. పాపన్న చదువుకునే రోజుల్లో ఏఐఎస్ఎఫ్‌లో చురుకుగా పనిచేస్తూ, చదువు అయిపోయిన తర్వాత వారి సొంత గ్రామం మదనంతపురం గ్రామంలో సీపీఐలో క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. పేద ప్రజలకు కార్మికులకు అండగా, పెత్తందారితనానికి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు.

మద్దికేర మండల కార్యదర్శిగా పనిచేశారని బసినేపల్లి గ్రామ సర్పంచుగా ఎన్నికై మదనంతపురం, బసినేపల్లి గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశారని ప్రజలతో చాలా సన్నిహితంగా మెలుగుతూ, మంచివ్యక్తిగా పేరు సంపాదించుకున్నారన్నారు. పాపన్న కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని,ఆయన మృతి సీపీఐకి ప్రజాసంఘాలకు తీరని లోటని బి.గిడ్డయ్య తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం



విశాలాంధ్ర-ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరుకు చెందిన బండా సత్యనారాయణ ఇండియన్‌ఆర్మీలో సేవలందించి పదవి విరమణపొంది ఎమ్మిగనూరుకు రావడంతో సోమవారం ఆయనకు ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి సభ్యులతో పాటు మిత్రులు వారి కుటుంబ సభ్యులతో కలిసిజవాన్‌ను ఘనస్వాగతం పలికారు.దేశంకోసం 22ఏళ్ల పాటు సేవాలందించి తిరిగి రావడం.. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదికలోటీడీపీ నాయకులు రామకృష్ణనాయుడు, రంగస్వామిగౌడ్, వైసీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రిన్స్ సేవా సమితి అధ్యక్షుడు వహాబ్, విజేత నాగరాజు, హెచ్‌ఎం లచ్చప్ప, డిప్యూటీ తహశీల్దార్ విజయ్‌లు కలిసి దుస్సాలువలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సోమప్ప సర్కిల్, వైఎస్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చి వీవర్స్ కాలనీ తన ఇంటికి చేర్చారు. సైనికుడికి సన్మానం దేశానికి చేసినట్టేనన్నారు. దేశ సరిహద్దుల్లో ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న ఆర్మీ ఉద్యోగం చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయమన్నారు.

తల్లికి వందనం నిధులు విడుదల చేయాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్రబ్యూరో-కర్నూలు: తల్లికి వందనం నిధులు వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు.సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సీ.ఆర్. భవన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల నుంచి ఆదుకోవడానికి తల్లికి వందనం పేరుతోటి విడుదల చేస్తామని ఇంట్లో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని కానీ ప్రస్తుతం విద్యార్థులకు ఒక క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినటువంటి తల్లికి వందనం ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు తక్షణమే విడుదల చేయాలన్నారు.గత ప్రభుత్వం కూడా ఇంట్లో అందరికీ వర్తింపచేస్తాం, అమ్మఒడని చెప్పి ఒకరికి మాత్రమేఇచ్చారని కనీసంఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిలబడాలని ఇంట్లో అందరికీ తల్లికి వందనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో నెం.29 పేరు తోటి అనేక అపోహలు వస్తున్నాయని వాటిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే క్లారిటీ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం స్కూల్ ఫీజులు కట్టుకునే సమయం కావడం, ఈ సమయంలో విడుదల చేస్తే విద్యార్థులు ఫీజులు కట్టుకునేకి విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదన్నారు.ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్ నగర నాయకులు అనిల్, వర్ధన్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లలో సామాజిక మార్పు అవసరం

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లలో సామాజిక, ప్రవర్తన మార్పు అవసరమని మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య అధికారి డా.నూటన్ అన్నారు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను ప్రోత్సహిస్తూ.. ప్రజల్లో సామాజిక, ప్రవర్తన మార్పును కలిగించే విధంగా ఏయే చర్యలు తీసుకోవాలో వాటి గురించి సమావేశంలో వివరించారు. వారినిదృష్టిలో పెట్టుకొని మార్పు సంకేతాల అయ్యేలా కృషి చేస్తూనే కార్యాచరణ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కోరారు. ప్రతిఒక్కరూపనిచేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లలో సామాజిక,ప్రవర్తన మార్పు వస్తేనే ప్రజలు కూడా మారతారన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు.సమావేశంలో డా.రాధ, నీతి ఆయోగ్ ఏబీపీ ఫెలో రవిశంకర్ హాజరయ్యారు.

విరిగిన విద్యుత్తు స్తంభం-పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-హొళగుంద : మండల కేంద్రమైన హొళగుందకు రెండు కిలోమీటర్ దూరంలో ఉన్న మోసంబి హసీన్సాబ్ తోట వద్ద విద్యుత్ స్తంభం విరిగిందని దీంతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆరోపించారు. విద్యుత్ స్తంభం ఎప్పుడు విరిగి పడుతుందో ఎప్పుడు ఏ సంఘటన జరుగుతుందో చెప్పలేమని ప్రజలు వాపోయారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పక్కనే విద్యుత్ స్తంభం విరిగిన సంబంధిత అధికారులు చూసి చూడనట్లు ఉన్నారని వాపోయారు.విద్యుత్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్ స్తంభాన్ని అమర్చాలని ప్రజలు రైతులు డిమాండ్ చేశారు.విద్యుత్ స్తంభం పోరుగాలికి కూలి కింద పడితే వైర్లు కిందకు తాకితే ప్రమాదం జరుగుతుందని ప్రజలు భయాందోళన చెందారు.విద్యుత్ ఏఈ ఓబులమ్మ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందికి పంపించి విద్యుత్ స్తంభాన్ని అమర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- 15 తీర్మానాలకు అమోద ముద్ర
- రూ 9.19 కోట్ల నిధుల ఖర్చుకు పచ్చ జెండా
- పలు సమస్యలు లేవనెత్తిన పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం సాధారణంగా జరిగింది.నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నూతన ప్రజాప్రతినిధులతో కలసి పని చేద్దామని నగర మేయర్ బోయ ఎల్లా రామయ్య చెప్పారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో మేయర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యేలుగా ఎన్నికైనతర్వాత తొలిసారి సమావేశానికి వచ్చిన గౌరుచరిత, బొగ్గుల దస్తగిరిలను మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు సత్కరించారు. కాగా సమావేశంలో 15 అజెండాలకు ఆమోదం తెలిపారు. నగరపాలక సాధారణ నిధుల నుండి రూ.9.19 కోట్ల అభివృద్ధి పనులను ఖర్చు చేయడానికి పాలకవర్గం పచ్చజెండా ఊపింది. ఈ సందర్భంగా పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ కల్లూరు వార్డులలో తాగునీటి సరఫరా సమయాన్ని పగటిపూటకు మార్చి, సరఫరా సమయం మరింతగా పెంచాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కోరారు.అధ్వాన్నంగా మారిన రహదారులను తక్షణమే గ్రావెల్ రోడ్లు వేయాలన్నారు. కబ్జాలకు గురవుతున్న పలు పార్కు స్థలాలు కాపాడి, ప్రహరీ గోడలు నిర్మించాలని, ముజఫర్ నగర్ నందు హంద్రీ నది ఒడ్డున పిచ్చి మొక్కలు తొలగించాలని ఆమె సూచించారు.ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని మూడు వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు మరింతగా పెంచాలని, కుక్కల బెడద తగ్గించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశ్నోత్తర సమయంలో డివిజన్ల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్లు సభ దృష్టికి తెచ్చారు. పలు డివిజన్లలో తలెత్తుతున్న మంచినీటి సరఫరా, డ్రైనేజీ రోడ్ల అభివృద్ధి పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా సభలో చర్చించారు. అంతేకాకుండా నగరంలో కుక్కలు, పందుల బెడద సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మరోసారి సభ దృష్టికి తెచ్చారు.విద్యుత్ శాఖ పనితీరు బాగాలేదని కొట్టేసిన చెట్టు కొమ్మలు అక్కడే పారేయడం సరికాదని కార్పొరేటర్ పరమేష్ మండిపడ్డారు. సమావేశంలో కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలన్నింటికీ తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ భార్గవ్‌తేజ సమాధానమిచ్చారు.విద్యుత్‌శాఖ అధికారులపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.పలుమార్లు కార్పొరేటర్లు ఆశాఖ అధికారులకు సమస్యలు చెబుతున్న తమకేం పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, అరుణ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, సెక్రటరీ నాగరాజు, ఎస్‌ఈలు శేషసాయి, షాకీర్, ఆరోగ్యధికారి విశ్వేశ్వర్‌రెడ్డి,మేనేజర్ చిన్నరాముడు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కారిస్తామని నగరపాలక మేనేజర్ చిన్న రాముడు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చినట్లు మేనేజర్ పేర్కొన్నారు. ప్రధానంగా భ్రమరాంబ నగర్ వాసులు పైప్ లైన్ వేయాలని, సరస్వతి నగర్ నందు శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ కాలువను పునర్నిర్మాణం చేపట్టాలని స్థానిక కాలనీవాసులు,టిడ్కో ఇంటి కోసం చెల్లించిన నగదు వెనక్కి చెల్లించాలంటూ ఏ.చిట్టిగోవర్ధనమ్మ, తనవికలాంగ పింఛన్ తిరిగి మంజూరు చేయాలని సలావుద్దీన్,తనకు ట్యాప్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని టెలికాంనగర్‌కి చెందిన సి.సుంకన్న,తన స్థలానికి రీసర్వే చేయాలని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన హెచ్‌బి రోజరాణి అర్జీలు ఇచ్చినట్లు మేనేజర్ తెలిపారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో టిడ్కో అధికారి పెంచలయ్య, సూపరింటెండెంట్ స్వర్ణలత, ఆర్ఐ సాధిక్, సినియర్ అసిస్టెంట్ రామకృష్ణ, ఉమేష్, మల్లెపోగు కుమార్, లోకేష్ పాల్గొన్నారు.

ఖాజా హుస్సేన్ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



విశాలాంధ్ర-జిల్లా పరిషత్ : కర్నూలు సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ మక్కాయాత్రకు (ఉమ్రాయాత్ర) వెళుతున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి సాకే శైలజనాథ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాబురావులు ఖాజా హుస్సేన్‌కు శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. శైలజనాథ్ మాట్లాడుతూ ఖాజా హుస్సేన్ అల్లా దయతో ఉమ్రా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకొని రావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం, డీసీసీ ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కల్లూరు: బీసీల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసే వ్యక్తి కేశన శంకర్ రావు అని పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. ఈ మేరకు సోమవారంరాష్ట్ర బీసీసంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకర్‌రావు 68వ జన్మదిన వేడుకలు కీర్తన అనాథాశ్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి దేవేంద్ర ఆధ్వర్యంలో కేకుకట్ చేసి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. గుడిసె శివన్న మాట్లాడుతూ కేశన శంకర్ రావు బీసీల సమస్యల కోసం నిరంతరం పోరాడుతూ ఎన్నో ప్రశంసలు అందుకున్న వ్యక్తి ఎల్లప్పుడు బీసీలకు అందుబాటులో ఉంటూ రాష్ట్ర నలుమూలల కార్యక్రమాలు ఉద్యమాలు చేస్తూ ఏన్నో ఫలాలు అందించడాని ఆయన సేవలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పోస్టర్ షాపుకో ముద్రించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో నాగార్జునగౌడ్, బాలాజీ, మధు యాదవ్, వర్ల సుంకన్న ,కార్తీక్ ఆశ్రమ నిర్వాహకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విశాలాంధ్ర-కర్నూలు సిటీ : ప్రతి విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నారాయణ పాఠశాలల కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి సూచించారు. సోమవారం మాధవ నగర్ లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తఫ్ అధ్వర్యంలో కేబినెట్ ఎలెక్షన్స్ నిర్వహించారు. స్కూల్ ఏజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమానికి హైస్కూల్ కో-ఆర్డినేటర్ భాగ్యలక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల సరళి, ఎన్నిక విధానం పై స్టూడెంట్స్ కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. దేశాభివృద్ధి వేగంగా జరగాలంటే ప్రతిఒక్కరూ ముందుకు వస్తే ఫలితాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం స్కూల్లో జరిగిన స్కూలు స్పెషల్ లీడర్స్ ఎన్నికలు విద్యార్థి దశ ను గుర్తుకు తెస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రబీ రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి- సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-ఆస్పరి : గతేడాది రబీలో పంటలు వేసి నష్టపోయిన ప్రతిరైతుకు పంట నష్టపరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రంగన్న, సీనియర్ నాయకులు అంజినయ్యలు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది అనావృష్టి కారణంగా ఖరీఫ్, రబి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు మాత్రమే నష్టపరిహారం మంజూరు చేసి, రబీ రైతులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం గతేడాదిలో నష్టపోయిన రబీరైతులకు పంట నష్ట పరిహారం మంజూరు చేయాలని కోరారు. ఈఖరీఫ్‌లో ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని, చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు పంటసాగుకు పొలాలను సిద్ధం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పెట్టుబడి సహాయం కింద ఎకరాకు రూ. 15 వేలు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు అనుగుణంగా స్కేల్ ఫైనాన్స్‌ను పెంచి బ్యాంకుల ద్వారా రూ.3 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని, కల్తీ విత్తనాలు, రసాయనిక ఎరువులను అరికట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, బడేసాబ్, ఉరుకుందప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు మహానంది, నాగేషు, ఈరన్న, ఏఐవైఎఫ్ నాయకులు రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఈశ్వర్ లు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ పంటల సాగుపై అవగాహన

విశాలాంధ్ర-చిప్పగిరి: రైతులు ఖరీఫ్ సీజన్ లో సాగు చేసే పంటలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారిని జయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవ కేంద్రాల ఇన్చార్జిలతో సమీక్ష సమావేశమును నిర్వహించారు. ఈసందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల రైతులకు రైతు సేవ ఇన్చార్జిలు అందుబాటులో ఉంటూ రైతులకు సరైన సలహాలు సూచనలు తెలియజేస్తూ ఖరీఫ్ సీజన్ లో పంటలు సాగు చేసే రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యముగా ఆయా గ్రామాల నందు రైతుల నుండి పొలమును కౌలు చేసుకునే రైతులు కౌలు గుర్తింపు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ సామాన్ నిధి రికార్డుల వెరిఫికేషన్లను రైతులకు తెలియజేస్తూ పెండింగ్ లో ఉన్న వాటిని ఎప్పటికప్పుడు సరిచేయాలని తెలియజేశారు. రైతులు సాగు చేసే పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి రైతులకు ఆ పంట పొలాల్లో దిగుబడి వచ్చే పంటలను రైతులు సాగు చేయాలని రైతులకు సూచించాలన్నారు. రైతుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు అర్హులైన ప్రతి ఒక్క రైతుకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమములో మండల వ్యవసాయ విస్తరణ అధికారిని రమాదేవి, గ్రామ రైతు సేవ ఇన్చార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

వాసంతి మృతికి కారణమైన మానవ మృగాలను శిక్షించాలంటూ రాస్తారోకో

విశాలాంధ్ర-గోనెగండ్ల: వాసంతి మృతికి కారణమైన మానవ మృగాలను శిక్షించాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పోతుల పాడు నాగరాజు,రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు పాండు, మండల అధ్యక్షులు పూర్ణ దినకర్,షాదీక్,రవి, గజేంద్ర, డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో హైస్కూల్-బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారులపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 ఏళ్ల వాసంతిని అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ చిన్నారి మృతదేహం ఇంత వరకు ఆచూకీ లభించక పోవడం బాధకరమని వాసంతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-ఆస్పరి : నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంముచ్చుమర్రిలో 8 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాకార్యవర్గ సభ్యులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ, దిశ చట్టాలు తెచ్చిన దేశవ్యాప్తంగా చిన్నారులు, మహిళల పైన అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని దిమాండ్ చేశారు.సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, ఉరుకుందప్ప, ఏఐఎస్ఎఫ్ మండల కోశాధికారి రాజు,సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మైనర్ బాలికను అత్యాచారం,హత్య దుర్మార్గం

విశాలాంధ్ర-కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రికి చెందిన మైనర్ బాలికను అత్యాచారం చేసి హత్య చేయడాన్ని కర్నూలు జిల్లా భగీరథ ఉప్పర సగర సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను చట్ట ప్రకారంగా శిక్షించాలని సంఘం జిల్లా అధ్యక్షులు సత్యన్న డిమాండ్ చేసారు.సంఘటన జరిగి వారం రోజులు అవుతున్నా బాలికఆచూకీ కనుక్కోలేక పోయారు. జరిగిన సంఘటనపై ప్రభుత్వం కూడా పెద్దగా స్పందించినట్లు కనపడటం లేదు. ఇప్పటి వరకు హెూం మంత్రి భాధితులను పరామర్శించలేదు. అధికారంలోకి రాకముందు బాలికల అత్యాచారాలపై, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఆవేశంగా మాట్లాడారు.అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపడం లేదు.పదవి రాకముందు మహిళల అత్యాచారాలపై ఆవేశపూరిత ప్రసంగాలు చేసిన పవన్ కళ్యాణ్.. పదవి వచ్చిన తర్వాత మాట్లాడలేకపోతున్నాడు.ప్రతిపక్షంలో ఉంటే ఒకటి అధికార పక్షంలో ఉంటే మరొకటా.మరీ 6 నెలల పసికందులు, 8,తొమ్మిదేళ్ల చిన్నారులు, మహిళలు ఇలా అన్ని వయసులవారిపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే రాష్ట్రంలో ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదు. కనుక్కోలేదో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు.

ప్రజారక్షణకు అందుబాటులో ఉంటాం-ఎస్పీ గరికపాటి

విశాలాంధ్ర-కర్నూల్ క్రైం : ప్రజారక్షణకు 24 గంటలు అందుబాటులో ఉంటామని కర్నూలు జిల్లా నూతన ఎస్పీ గరికపాటి బిందు మాధవ్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కర్నూలు ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా ఎస్పీ ఆఫీస్ వ్యాసు ఆడిటరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎస్పీగా తనను నియమించినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు, డీజీపీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సామాన్యుడు ఎలాగైతే అనారోగ్యం కలిగినపుడు ఆసుపత్రికి పోతాడో అలాగే తనకు రక్షణ కోసం స్టేషన్‌కి రావాలని ఆయన కోరారు. జిల్లాలో ముఖ్యంగా మహిళలపై, చిన్నారులపై ఏలాంటి అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జిల్లాలో సైబర్ క్రైమ్ మోసాలు అధికమవుతున్నాయని వాటిని అరికడతామన్నారు. గంజాయి రహిత కర్నూలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతరం విలేకరుల ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్నూలు సిటీలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, ట్రాఫిక్ సమస్య, నగరంలో పిక్ పాకెటింగ్ జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు తెలిపారు. ప్రతి వారం ఎస్పీల ఆధ్వర్యంలో జరిగే గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వెల్లువతుతున్నాయని కాని అందులో ఎన్ని పరిష్కారమాయాయో తెలియదని పరిష్కరించిన సమస్యలు చెబితే బాగుంటుందని విలేకరులు కోరారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పొలం తగాదాలో హత్య చేసిన ముద్దాయిలు అరెస్ట్



విశాలాంధ్ర-ఆదోనిరూరల్: మండలంలోని నాగనాథనహల్లిలో పొలం తగాదాలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్య చేసిన ముద్దాయిలను సోమవారం డిఎస్పి శివనారాయణస్వామి సమక్షంలో మీడియా ముందు ప్రవేశ పెట్టారు. సంబందించిన ఘటనలో దళిత గుండమ్మ అక్కడికక్కడే చని పోగా, కల్లుబావి పురుషోత్తంరెడ్డిపై కర్రతోకొట్టడంతో చెయి విరిగిపోవడం, గుండమ్మ దత్తపుత్రుడు కిషోర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఇస్వి పోలీస్ స్టేషన్లో పలు సెక్షన్లు, ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ కేసును ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామిని దర్యాప్తు అధికారిగా నియమించడంతో శవపరీక్ష, సంఘటన జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా నిబంధనల ప్రకారం దర్యాప్తు చేపట్టగా లభించిన ఆధారాలతో పదిమంది సాక్షులను విచారణ చేపట్టి వీడియో ఫోటోలు ఆధారంగా ముద్దాయిలను గుర్తించి వారికోసం ప్రత్యేక బృందంచే గాలింపు చర్యలు చేపట్టగా శ్రీధర్ రెడ్డి,రాఘవేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి,హెబ్బటంరామకృష్ణ, ముద్దాయిగా దాసరి గోవిందులుగా దర్యాప్తులో చేర్చినట్లు డీఎస్పీ మీడియాకు తెలిపారు. డీఎస్పీ తెలిపిన మేరకు నాగనాతనహల్లి పరిధిలో సర్వే నెం. 500/డి లోని నాలుగెకరాల పొలాన్ని రాఘవేంద్రరెడ్డి చిన్నమ్మ తిరుమలమ్మతో 2019లో భూమి కొనుగోలు చేసి 2022లో హరిజన గుండమ్మ దత్తపుత్రుడైన కిషోర్ కుమార్‌పై రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. నాలుగెకరాల పొలానికి సంబంధించి రాఘవేంద్రరెడ్డికి చిన్నమ్మ తిరుపలమ్మతో వివాదం ఉండేదని, ఆదోని సివిల్ కోర్టులో వ్యాజ్యము నడుస్తున్నట్లు చెప్పుకొచ్చారు. దళిత మహిళ గుండమ్మ భూమిని కొనుగోలు చేసినప్పటి నుంచి సాగులో ఉండేదని, ఈ నెల 12న గుండమ్మ పొలంలో ట్రాక్టర్ సేద్యం చేస్తుండగా విషయం తెలుసుకున్న రాఘవేందర్ రెడ్డి ఆ భూమిలో నాకు వాటా ఉందని ఘటన చోటుచేసుకుని ఉందని తెలిపారు. ముద్దాయిలపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు మీడియాకు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 16, జూలై 2024

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - రుద్రవరం : గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రామచంద్ర పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం పై చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. గ్రామాలలో త్రాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ట్యాంకులను శుభ్రపరచాలని పంచాయతీలలో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వర్తించాలని, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న ఫాగింగ్ మిషన్లను సిద్ధం చేసుకుని కాలనీలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పోలీస్ స్టేషన్

- పోలీసు స్టేషన్ భవనం శిథిలం
- పైకప్పు కూలి పోకుండా కర్రల ఏర్పాటు
- భయం గుప్పిట్లో పోలీసులు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. బ్రిటీష్ కాలం నాటి నిర్మాణం చెక్క దంతెలతో వేసిన భవనం కావడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. పోలీసులు, సిబ్బంది దంతెలు, దూలాలు కూలకుండా అడుగు భాగాన కర్రలు ఏర్పాటు చేశారు. వాటి కిందనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు కూలుతుందోనని వారు భయం భయంగా ఉంటున్నారు. ఉన్న తాధికారులు స్పందించి భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్ : చాగలమర్రి పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నివసిం చేందుకు నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి పోలీసులు నివాసం ఉండేందుకు గతంలో క్వార్టర్స్ నిర్మించారు. భవనాలు లోపలి భాగం దెబ్బతిని పెచ్చు లూడుతున్నాయి. దీంతో పోలీ సులు అద్దె ఇళ్లలో ఉంటున్నారు. కొత్త భవనాలు నిర్మిస్తే పోలీసులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

వేధిస్తున్న పోలీసు సిబ్బంది కొరత : చాగలమర్రి పోలీసు స్టేషన్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఎస్ఐ, ఏఎస్ఐ, ఇద్దరు హెడ్ కాని స్టేబుళ్లు, 5 మంది కానిస్టేబుళ్లు, హెూంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 18 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం 7 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పని భారం అధికమై ఉన్న పోలీసులు ఇబ్బందికి గురౌతున్నారు. ఉన్న పోలీసుల లోనే ఇద్దరు స్టేషన్లోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. రాత్రి పూట గస్తి చేయ దానికి కూడా వీలు లేదు. పోలీసు స్టేషన్లో ఖాళీగా ఉన్న కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేసి ప్రజలకు రక్షణ సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా ఎస్పీ చాగలమర్రి పోలీసు స్టేషన్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలం లోని నగళ్ళపాడు గ్రామంలో ఈ నెల 16 న ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చాగలమర్రి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వర ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ఎదకు రాని పశువులకు వైద్య పరీక్షలు, ఐదు నెలల లోపు చిన్న దూడలకు నట్టల నివారణ ముందు వేయడం,పశువులకు గర్భకోశ వ్యాధుల గురించి చికిత్స చేయడం,పశువులకు వివిధ రకాల వైద్య చికిత్సలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ వైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స

విశాలాంధ్ర - బేతంచెర్ల : రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఆర్ఎస్ రంగాపురం పశు వైద్యశాల, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా డాక్టర్. రాజశేఖర్ ఈవో పశు గణనాభివృద్ధి సంస్థ కర్నూలు వారు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిభిరానికి నంద్యాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, డోన్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఆర్.నాగరాజు, ఆర్ఎస్ రంగాపురం పశువైద్యశాల డాక్టర్. గౌసియా బేగం, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ రంగస్వామి ,డాక్టర్ అజయ్ కుమార్ హాజరై పశువులకు చికిత్సలు నిర్వహించడం అయినది. ఈ శిబిరంలో, గొడ్డు మోతు పశువులు, ఎదకురాన్ని పశువులకు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించడం అయినది. శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 45 పశువులకు చికిత్స నిర్వహించడం జరిగింది. రైతులకు పాడి పరిశ్రమ మరియు గొర్రెల పెంపకం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం పెయ్య దూడల పుట్టి కార్యక్రమం ఘర్భదారణ గురించి వివరించారు. పెయ్య దూడల పోషణ గురించి, పుట్టిన దూడల గురించి పెద్దవిగా ఎదిగే వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రతి సంవత్సరంకు ఒక దూడ పుట్టే విధంగా చూసుకోండి రైతులకు లాభదాయకంగా ఉంటుంది దాని కార్యక్రమం పాల ఉత్పత్తులు, దూడల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.పార్థసారథి రెడ్డి, డాక్టర్ నాగరాజులు మాట్లాడుతూ నేటి దూడలే రేపటి పాడి పశువులు అని పుట్టిన వెంటనే జున్నుపాలు దూడలకు త్రాపించాలని తెలిపారు. పాడి పశువులను మంచి పోషణ ఇవ్వాలని దీని ద్వారా పశువులు తొందరగా ఎదకు వచ్చి తొందరగా చూడు కట్టుతాయని, 75శాతం సబ్సిడీతో రైతులకు మేలైన పశుగ్రాస విత్తనాలను సరఫరా చేస్తామని ఈ విషయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అర్హులైన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-హెూళగుంద : మండలంలోని అర్హులైన కౌలు రైతులు కౌలు రైతుల హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ప్రసాద్ కోరారు. సచివాలయంలో సోమవారం కౌలు రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు హక్కు పత్రాలు పొందితే పంట నమోదు తో పాటు పంట నష్టపరిహారం, బీమా పరిహారం, బ్యాంకు రుణాలు పొందవచ్చున్నారు. కౌలు రైతులతో పాటు భూ యజమానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు .కౌలు హక్కు పత్రాల కోసం రైతులు సరైన ఆధారాలున్న పత్రాలు అందిస్తే విచారించి హక్కు పత్రాలు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయ అధికారి హాజరుకాకుండా సమావేశాలు ఎలా జరుపుతారని అతనికి మేమో జారీ చేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ దినోజ్ కుమార్, వీఆర్వో నాగరాజు, ఏఏఓలు సుంకమ్మ మణిశ్రీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పాపన్న మృతికి
సీపీఐ జిల్లా సమితి సంతాపం

విశాలాంధ్ర - నంద్యాల : కర్నూలు జిల్లా మద్దికెర మండలం సీపీఐ మాజీ కార్యదర్శి, బసినేపల్లి మాజీ సర్పంచ్ కామ్రేడ్ పాపన్న సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి నంద్యాల జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్‌లు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. పాపన్న ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

కుష్టు వ్యాధులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల : ఈ నెల 18 నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాల్లో పీజీఆర్ఎస్ పరిష్కార వేదికలో భాగంగా జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో ఎ.పద్మజ, వైద్యాధికారులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాక్టీరియల్ ఇన్ఫె క్షన్ వల్ల వచ్చే కుష్టు వ్యాధిగ్రస్తులను ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు రెండో తేది వరకు ఇంటింటికి వెళ్లి గుర్తించే విధంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఆదేశాలు జారీ చేయాలని డీఎం హెచ్వోను ఆదేశించారు. కుష్టు వ్యాధి లక్షణాల ను గుర్తించే విధానంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. గుర్తించిన అనంతరం ఏవిధమైన చికిత్సలు అందిం చాలి, మందులు వాడే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలను సమన్వ యం చేసుకొని చురుకుగా పనిచేయాలని ఆమె ఆదేశించారు. అలాగే కుష్టు వ్యాధి లక్షణాలున్న వ్యక్తిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధిని అరికట్టి, అంగ వైకల్యం రాకుండా నివారించ వచ్చన్నారు. జిల్లా లోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 2 నుంచి ఆరేళ్ల పిల్లలను, అన్ని పాఠ శాలల్లోని పిల్లలను, సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు, కళాశాల విద్యార్థు లకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ, పట్టణ వార్డులలో కుష్టు వ్యాధి లక్ష ణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ పకడ్బందీగా సర్వే నిర్వ హించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకట రమణ, డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ఎం.శారద బాయి కుష్టు వ్యాధి లక్షణాలు తెలియ చేశారు. మల్టీ డ్రగ్ థెరపీ చికిత్స ద్వారా కుష్టు వ్యాధి త్వరగా నయం అవుతుందని తెలియచేస్తూ, ఈ మందులు ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు.

నేటికీ అంతు చిక్కని ఆచూకీ..

- మరోసారి జాగిలాలతో గాలింపు ..
- గాలింపునకు వర్షం అంతరాయం..
- బాధిత కుటుంబానికి 10 లక్షల పరిహారం
- ముచ్చుమర్రికి రానున్న హెూంశాఖ మంత్రి..

విశాలాంధ్ర - మిడుతూరు : పగిద్యాల మండల పరిధిలోని ముచ్చుమర్రి పంచాయితీ మజారా గ్రామమైన.. ఎల్లాలకు చెందిన ఎనిమిదేళ్ల బాలిక అదృశ్యమై నేటికి తొమ్మిది రోజులు గడిచాయి. నేటికీ అదృశ్యమైన వాసంతి జాడ కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలు కేసు దర్యాప్తు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది. ఈ గాలింపు చర్యలకు రెండు రోజులుగా వర్షం కురవడంతో అంత రాయం ఏర్పడింది. అయితే రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రసార మాధ్యమాల్లో మాట్లాడుతూ తొమ్మిదేళ్ల చిన్నారి వాసంతికి జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని, తామే స్వయంగా ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని అందజేస్తామని వెల్లడించారు. నిందితులు ఎంతటి వారైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు.. రేపో ముచ్చుమర్రి గ్రామానికి హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత రానున్నట్లు తెలుస్తోంది.

కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - రుద్రవరం: భూములు కౌలు కు తీసుకొని పంట లు సాగు చేసే రైతులు కౌలు కార్డు కొరకు దర ఖాస్తు చేసుకో వాలని తహసీల్దార్ మురళీ మోహన్ తెలిపారు. స్థానిక తహ సీల్దార్ కార్యాలయం నందు పంట సాగు హక్కు పత్రాల మీద రైతు సేవ కేంద్రాల సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులకు తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని కౌలు రైతులను త్వరితగతిన గుర్తించాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ మాట్లాడుతూ మండలంలో కౌలుకు వ్యవసాయం చేసే ప్రతి రైతు సీసీఆర్సీ కార్డ్స్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనివలన ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్నప్పుడు, పంటలు పండించిన తర్వాత మార్కెట్ యార్డునందు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చినప్పుడు సీసీఆర్సీ కార్డ్స్ ఉపయోగ పడతాయని తెలిపారు. కౌలు కార్డు దరఖాస్తు కొరకు భూ యజమాని సంబంధించిన వన్ బీ, పొలం పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు, కౌలుకు సాగుచేసే రైతు ఆధార్ కార్డు రెండు పాస్ ఫొటోస్‌తో రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఆర్ఐ రామరంజిత్ కుమార్, ఏఈఓ రాజు, వీఆర్వోలు రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. మౌర్య మాట్లాడుతూ ప్రజా పరిష్కారానికి వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజా వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేలా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎక్కువ శాతం భూములకు సంబంధించిన సర్వే, సదరన్ సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఎక్కువ శాతం దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని, చేసుకున్న దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

21న రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక ప్రదర్శన

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయం నందు రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఘనులు, భూగర్భ శాఖ మాజీ ఎండీ, వీడీ రాజగోపాల్ తెలిపారు. ఈ నెల 21న గురు పౌర్ణమి వేడుకలు సందర్భంగా శ్రీ శిరిడి సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆయా గ్రామాల భజన సంఘాల చేత భజనలు, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకులు డాక్టర్ రవీంద్ర బాబు అరవ, నోరి రఘురామమూర్తి దంపతుల చేత భక్తి గీతాంజలి పాటలు కార్యక్రమం ఉంటుందన్నారు. 15 ఏళ్లలోపు పదిమంది చిన్నారులచే భక్తి పాటల పోటీ ఉంటుందని, ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు. రాత్రి రాష్ట్రస్థాయి పౌరాణిక కళాకారులచే పంచమాంకములు పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

పంపు హౌస్ కూలగొట్టారు.. పట్టించుకోండి సార్ !

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో 40 ఏళ్ల కిందట మంచినీటి సరఫరా నిమిత్తం పంప్ హౌస్ ఏర్పాటు చేశారు. ఈ స్థలం మాది అంటూ గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్వో రామమోహన్ రెడ్డితో కలిసి కొందరు పంప్‌హౌస్ నేల కూల్చారని గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఆవుల రాఘవేంద్ర రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఈవోపీఆర్డీ మహీధర్ రెడ్డిలకు మాజీ ఉప సర్పంచ్ వివరించారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన పంపు హౌస్‌ను ఇప్పుడు తొలగించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సాయంత్రంలోగా గ్రామాన్ని సందర్శించి, పడగొట్టిన స్థలాన్ని పరిశీలించి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

కౌలు రైతులకు అవగాహన

విశాలాంధ్ర- అవుకు: మండలంలోని సింగనపల్లి, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన కౌలు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో ఆయా రైతు సేవా కేంద్రాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతులను ఉద్దేశించి వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ మాట్లాడుతూ కౌలు రైతులు భూ యజమానుల వద్ద నుండి కౌలు కార్డులు తీసుకోవాలని అన్నారు.కౌలు కార్డు వలన పంట నమోదు, ప్రభుత్వం వారిచే పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, పంట నష్టం, పంట బీమా, బ్యాంకు రుణాలు వంటి ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. కనుక కౌలు రైతులందరూ తప్పకుండా గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డు పొందవలెనని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

పీఆర్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నియోజక వర్గంలో నిలిచి పోయిన రహదారుల గురించి, రోడ్ల అభివృద్ధి అంశా లపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో స్వగృహంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22న అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాల్సిన రహదారులు, ఆగిపోయిన రహదారులకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. నియోజక వర్గంలో ప్రజలు రోడ్డు లేక ఇబ్బందులు పడకూడదని అధికారులకు సూచించారు. పూర్తి వివరాలతో తనకు నివేదిక అందజేయాలని సంబంధిత మంత్రులను కలిసి ఆళ్లగడ్డ నియోజకవర్గానికి కావాల్సిన నిధులను తీసుకొని వచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆళ్లగడ్డ పంచాయతీరాజ్ డిఈ లక్ష్మీ నరసింహుడు, ఏఈ కమాల్ సాహెబ్ తో పాటు ఆయా మండలాల ఏఈలు పాల్గొన్నారు.

యాగంటి ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ

విశాలాంధ - బనగానపల్లె: మండల పరిధిలోని యాగంటి శ్రీ ఉమామహే శ్వర స్వామి దేవ స్థానం నందు సోమవారం సందర్భముగా పల్లకి మహెూత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రదోషకాల ప్రత్యేక పూజల అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకి నందు, నంది మంటపము నందు వేంచేపు చేసి పూజల అనంతరం ఆలయము నందు పల్లకి ఉత్సవం నిర్వహించబడినది. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమములో అలయాధికారి చంద్రశేఖర్ రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెదుదల మహేశ్వర్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు: ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని నందికొట్కూరు పట్టణ ఎస్సై వెంకటరమణ ప్రజలకు సూచించారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని స్థానిక పటేల్ సెంటర్ నందు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని ఆదేశాల మేరకు, కోర్టు సిబ్బంది, పోలీసులు, సోషల్ వర్కర్ హెల్మెట్ పై పటేల్ సెంటర్ నుండి కొత్త బస్టాండ్ వరకు అవగాహన, ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ బైక్‌పై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు తప్పక హెల్మెట్ ధరించి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్ జి వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

పాత్రికేయునికి మాతృవియోగం
- పరామర్శించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని కుద్బా వీధికి చెందిన సీనియర్ పాత్రికేయులు సత్తార్‌మియా తల్లి షహజాబీ (80) అనా రోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం సత్తార్ మియా స్వగృహానికి చేరుకొని మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ హుస్సేన్ బాష తదితరులు ఉన్నారు.